క్లుప్తంగా

పండ్ల తోటల సాగుతో లాభాలు



బైలుప్పలలో మామిడి తోటను పరిశీలిస్తున్న ఏపీఓ మహబూబ్ బాష

గోనెగండ్ల: పండ్ల తోటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఏపీఓ మహబూబ్ బాషా అన్నారు. మంగళవారం మండలంలోని గంజిహళ్లి, బైలుప్పల గ్రామాల్లో సాగుచేసిన పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్క ఎదుగుదలలో సోకే పురుగుల గురించి, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులకు మామిడి, కొబ్బరి, జామ, నిమ్మ, దానిమ్మ, సపోట పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం మొక్కలను వంద శాతం రాయితీతో అందిస్తుందని తెలిపారు. అలాగే మొక్కల పెంపకానికి ప్రభుత్వమే ఖర్చు పెడుతుందని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని చేపడుతున్న అభివృద్ధి పనులను టెండర్ల ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్లతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం చేస్తున్న పనులతో పాటు మున్సిపల్ సాధారణ నిధులు, 14వ ఆర్థిక సంఘం నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు దాదాపు రూ.4.68 కోట్లతో చేపట్టనున్న పనులకై టెండర్లు తీసుకున్న కాంట్రాక్టర్లు సత్వరం ఆయా పనులు పూర్తి చేయాలని కోరారు. పనులకు సంబంధించి బిల్లుల మంజూరు తదితర అంశాలపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాంట్రాక్టర్లకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఏఈ శరత్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

మద్దికెర: పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు పట్టించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని దీనివల్ల పోషకాహార లోపం, స్థూలకాయం, మధుమేహం, క్యాన్సర్ రాకుండా నివారించవచ్చన్నారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ వివాదాలకు చెక్

నందవరం: సమగ్ర భూసర్వేతో వివాదాలు తొలగిపోతాయని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దకొత్తిల్లి గ్రామంలో జరుగుతున్న భూ సర్వేను తహసీల్దార్ నిత్యానందరాజు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ పరిశీలించారు. సర్వే అధికారులు, రైతులతో ఆయన మాట్లాడుతూ.. సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. రైతులు సహకరించాలని కోరారు. సర్వేలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఎమ్మిగనూరు డివిజన్ సర్వేయర్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ అబ్బర్ బాషా, వీఆర్వో రమేష్, గ్రామ సర్వేయర్లు శ్రీకాంత్, ముగతి శేఖర్, రైతులు పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

నందవరం: పాడి రైతులు పశువుల పెంపకం, పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ సూచించారు. మంగళవారం జొహరాపురం గ్రామంలో పాడిరైతులకు పశువుల పెంపకం, పశువు సూడిపై వెటర్నరీ డాక్టర్లు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అలాగే విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు పశువులకు సూడి పరీక్షలు ఎలా నిర్వహించాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులు రెండు నెలలకోసారి పశువులకు సూడి పరీక్షలు చేయించాలన్నారు. పశువు గర్భధారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లేగ దూడల పెంపకం అవగాహన కల్పించారు. పశువులలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించాలన్నారు. అనంతరం పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జూనియర్ వెటర్నరీ డాక్టర్ గిరి ప్రసాద్, గోపాలమిత్ర సభ్యుడు నల్లారెడ్డి, వీవీఏలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రదర్శనకు ఎంపిక

పత్తికొండ టౌన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నేషనల్ స్పేస్ సొసైటీ (ఎన్‌ఎస్‌ఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అథెరా కృష్ణన్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎస్‌ఎస్‌ఎస్ అంతరిక్ష పరిశోధనలను ఆహ్వానిస్తుందన్నారు. అందులో భాగంగా తమ పాఠశాల విద్యార్థులు స్పేస్ కాలనీ, స్పేస్ హోటల్, ఆస్టిరాయిక్ మైనింగ్ అంశాలపై ప్రాజెక్టులు పంపగా వాటిలో విక్రమ్ సారాబాయి టీం స్పేస్ హోటల్ ప్రాజెక్టు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా ఏజీఎం సురేష్, ఆర్‌ఐ రంగారెడ్డి విద్యార్థులను అభినందించారు.

ఇక ఇంటికే పౌష్టికాహారం

- గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే పంపిణీ
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే ప్రారంభం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందుకున్న లబ్ధిదారులు

ఎమ్మిగనూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక నుంచి మరింత పకడ్బందీగా పౌష్టికాహారం పంపిణీ జరగనుంది. కింది స్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి అధికారుల వరకు సరుకుల పంపిణీలో జరుగుతున్న అవినీతికి ఇక చెక్ పడనుంది. ఇన్ని రోజులు చిన్నారులకు, బాలింతలు, గర్భవతులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మధ్యాహ్న భోజనం అందించేవారు. ప్రతి రోజు పప్పు, కూరగాయలు, ఆకు కూరలతో భోజనం అందిస్తున్నారు. ఈ విధానం అమలు తీరుపై కొందరు గర్భవతులు, బాలింతలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సర్వే నిర్వహించింది. నివేదిక ఆధారంగా ఆగస్టు 2 నుంచి ఇంటివద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నియోజకవర్గంలో...

నియోజకవర్గంలో ఎమ్మిగనూరు టౌన్, రూరల్, నందవరం, గోనెగండ్ల మండలాల పరిధిలో మొత్తం 282 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు 6 నెలల నుంచి 3 సంవత్సరాల్లోపు పిల్లలు 13,465 మంది ఉన్నారు. గర్భవతులు 3,083, బాలింతలు 2,667 మంది లబ్ధి పొందుతున్నారు. వీరందరికీ ప్రతి నెలా ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, 200 ఎంఎల్ పాలు, ఉడికించిన కోడి గుడ్డు ఇస్తున్నారు. వీరందరూ ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి తినాల్సి ఉంటుంది. 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు మాత్రం ఇంటికే సరుకులు ఇస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకుల పంపిణీ పక్కాగా లబ్ధిదారులకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు
ఎమ్మిగనూరు టౌన్	75	769	763
ఎమ్మిగనూరు రూరల్	81	921	746
నందవరం	58	629	536
గోనెగండ్ల	58	764	642

సర్వేలో ఇలా...

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, సేవలు అమలు తీరుపై ప్రభుత్వ నిఘా పెరిగింది. అంగన్‌వాడీ అధికారులు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణతో పాటు మహిళా పోలీసులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. వీరు నిత్యం కేంద్రాల్లో జరిగే కార్యకలపాలతో పాటు సేవల అమలు తీరును పర్యవేక్షిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇంత జరుగుతున్నా కొందరు సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధ్యాహ్న భోజనం కోసం చాలామంది అంగన్‌వాడీ కేంద్రం వైపు రావడం లేదు. ఇంకొంత మంది మధ్యాహ్న భోజనాన్ని ఇంటికి తీసుకెళ్తున్నారు. కొన్ని కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భవతులు రాకపోయినా వచ్చినట్లు నమోదు చేసుకొని సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వారిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఆకస్మిక తనిఖీల ద్వారా అసలు నిజాలు బయటపడుతున్నాయి. సర్వేలో బాలింతలు, గర్భవతులను మీరు కేంద్రాల్లోనే తింటారా, ఇంటికి ఇవ్వమంటరా అంటూ కేంద్రాలకు వెళ్లి సర్వే చేసింది, మరి కొందరిని ఫోన్ల ద్వారా వారి అభిప్రాయాలను తెలుసుకుంది. సర్వేలో చాలామంది సరుకులను ఇంటికే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అములులో మార్పులు చేసింది.



వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులు

ఇంటికి ఇచ్చే సరుకులు ఇవే...

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ఆగస్టు నుంచి ప్రతి నెలా గర్భవతులు, బాలింతలకు 3 కేజీల బియ్యం, కందిపప్పు కేజీ, పామాయిల్ 500 ఎంఎల్, గుడ్లు 25, పాలు 2.5 లీటర్లు, రాగి పిండి 2 కేజీలు, అటుకులు కేజీ, బెల్లం 250 గ్రాములు, చిక్కీ 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు, చొప్పున ఇంటివద్దకే అందించనున్నారు.

ఇంటి వద్దకే పంపిణీ చేస్తాం



జూలై నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులు లబ్ధిదారుల ఇంటివద్దకే పంపిణీ చేస్తున్నాం. ప్రభుత్వం ఉత్తర్వులు కూడా ఇచ్చింది. మాతా శిశు మరణాలు తగ్గించాలనే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోంది. బాలింతలు, గర్భవతులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి.

– సఫర్నీసాబేగం, సీడీపీఓ, ఎమ్మిగనూరు

రూ.2 కోట్లతో సీసీ రోడ్లకు ప్రతిపాదనలు

మద్దికెర: మండలంలోని గ్రామాలలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పీఆర్ ఏఈ మోహన్‌నాయక్ తెలిపారు. మంగళవారం రోడ్లు లేని ప్రాంతాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటోందన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెడతామన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ విష్ణు, కన్వీనర్ తాలూరి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణ వెంట ఉన్నారు.

కళ్ల కలకపై అప్రమత్తంగా ఉండాలి

హాలహర్వి: కళ్ల కలక పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మన్సూర్‌వలీ సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలతో ఆయన సమావేశమయ్యారు. కళ్ల కలక వ్యాపించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. కళ్ల కలక వైరస్‌తో వస్తుందని, గాలి, నీటి వల్ల, టవల్స్, జేబురుమాళ్లు, దుస్తుల వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. కళ్లు ఎర్రబడడం, వాపు, నొప్పి, దురద, చీము కారడం, రెప్పలు అతుక్కుపోవడం, వెలుతురు చూడలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. నొప్పి తగ్గడానికి ఐబ్రోఫెన్ ప్లస్ పారసిటమాల్ మాత్ర తీసుకోవాలని సూచించారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని, కళ్లను ఎక్కువగా తాకడం,నలపడం చేయరాదన్నారు. అలాగే నులి పురుగుల నివారణ, మిషన ఇంద్రధనస్సు ఫీవర్ సర్వేపై అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ అబ్రహం, సుగుణ సీహెచ్‌ఓ ఆదినారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే



పెద్దొడ్డి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కొనియాడారు. మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ పంచాయతీలోని పెద్దొడ్డి గ్రామంలో మంగళవారం ఆమె ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడుతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న నవరత్నాల సంక్షేమ పథకాలు పేదల పాలిట వరాలుగా మారాయన్నారు. గత తెలుగుదేశం పాలనలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవని, వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాలకు ఏ ఒక్కరూ దూరం కారాదనే ఉద్దేశంతో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీదేవి తెలిపారు. అర్హులై ఉండి పథకాలు అందని పక్షంలో తమను ప్రశ్నించవచ్చని, అలాంటి వారికి లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. ప్రజల్లో సీఎం జగనన్నకు వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలని, నీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను తనిఖీచేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేశారు. ఎంపీడీఓ విశ్వమోహన్, పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్, ఏఓ వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్, బలరాముడు, నాగేశ్వరరావు, అంజనేయులు, భాస్కర్, రామానాయుడు, వెంకటప్పనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు వెరిఫికేషన్ సర్వే



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

పత్తికొండ రూరల్: ఓటరు వెరిఫికేషన్ ఇంటింటి సర్వే పక్కాగా జరుగుతోందని ఆర్డీఓ మోహన్‌దాస్ అన్నారు. మంగళవారం పత్తికొండలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు ఈనెల 21వతేదీ వరకు ఇంటింటి సర్వే చేస్తారన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హులైన వారి పేర్లు జాబితాలో తొలగించబడుతాయన్నారు.పత్తికొండ తహశీల్దారు విష్ణుప్రసాద్, ఆయా మండలాల తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంతిల్లు లేని ఓటర్లకు నోషనల్ నంబర్లు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున

ఆలూరు రూరల్: ఓటు హక్కు కలిగి ఉండి ఇంటి నంబర్ లేని వారికి నోషనల్ ఇంటి నంబర్ కేటాయించాలని ఆలూరు అసెంబ్లీ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ మల్లికార్జున సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, 30 మంది బీఎల్‌ఓ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌ఓలతో పాటు ఆయా పార్టీలకు చెందిన బీఎల్‌ఏలు (బూత్ లెవల్ ఏజెంట్) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ చేయాలన్నారు. ఇంటి నంబర్ లేకుండా ఓటు హక్కు కలిగి ఉన్న వారికి పక్కనే ఉన్న ఇంటి నంబర్‌కు అనుసంధానంగా నోషనల్ నంబర్ కేటాయించాలన్నారు. ఇందు కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద ఉన్న డోర్ నంబర్లు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఒకే ఇంట్లో పది కంటే ఎక్కువ ఓట్లు ఉంటే వాటి వివరాలు సేకరించి.. వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు. జాబితాలో తప్పులు ఉన్న ఫొటోలు గుర్తించి, పోలింగ్ బూత్ మార్పులు, చేర్పులు, కొత్తగా ఓటర్ల నమోదు పక్కాగా చేయాలన్నారు. సాంకేతిక సమస్యల వల్ల సర్వే నెమ్మదిగా సాగుతోందని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. అనంతరం ఆలూరులో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఓటర్ల సవరణను పరిశీలించారు. ఆలూరు ఏఈఆర్వో రామాంజనేయులు, తహసీల్దార్లు కుమార స్వామి, వెంకటేష్ నాయక్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్, డీటీ గుండాల్ నాయక్ తదితరులు హాజరయ్యారు.

హోటళ్లలో శుభ్రత పాటించాలి



హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, శుభ్రత పాటిస్తూ ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిపోయిన మాంసాన్ని డీప్‌ఫ్రిజ్‌లలో పెట్టి మరుసటి రోజు వండకూడదన్నారు. చికెన్, మాంసం నిల్వ ఉంచి మరుసటి రోజు వండుతున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. వంట గదులు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు బేరర్లు వ్యక్తిగత శుభ్రత పాటించేలా యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుంటే పబ్లిక్ హెల్త్ యాక్ట్ కింద ఆయా హోటళ్లను సీజ్ చేస్తామని లేదా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. త్వరలో పట్టణంలోని హోటళ్లను తనిఖీ చేస్తామని వెల్లడించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

నందవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ సర్వేపై బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో ఓటర్ల సవరణ సర్వే, పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులపై సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బీఎల్‌ఓ రోజుకు 10 నుంచి 12 ఇళ్లలో ఓటర్లను విజిట్ చేయాలన్నారు. అలాగే కొత్త ఓటరు దరఖాస్తులపై దృష్టి సారించాలన్నారు. బీఎల్‌ఓల సర్వేపై ఎన్నికల సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. మండలంలో 58 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో మౌలిక వసతులు పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ బూత్‌లో విద్యుత్, తాగు నీరు, టాయిలెట్లు, ఫ్యాన్లు, ర్యాంపులు, రోపులు వంటి మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని 45, 46, 35, 34, 3 పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను వీడియోల ద్వారా తనిఖీ చేశారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎన్నికల డీటీ గురురాజరావు, డీటీ రఘువీర, ఎన్నికల సూపర్‌వైజర్లు ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, ఏఎస్‌ఓ సూర్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఓటరు సర్వేపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

పక్కా ఓటరు జాబితా రూపొందించాలి

ఎమ్మిగనూరురూరల్:తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు.ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 21 వరకు బీఎల్వో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను చూయించి అభ్యంతరాలు ఉంటే సేకరించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఎల్వోలకు సహకరించి తప్పులున్నా, కొత్త ఓటర్లు నమోదులో సాయం చేయాలని,అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. ఇంటింటి ఓటరు సర్వేలో నిర్లక్ష్యం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కొరతపై తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్ శర్మ, నిత్యానంద్, ఎన్నికల డీటీ గురురాజారావు, వీఆర్వో షేక్షావలి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 20 మందికి గాయాలు

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. కనబడిన వారిపై దాడి చేసి కరిచి గాయపరిచింది. ఈ దాడిలో సుమారు 20 మందికి పైగా గాయపడ్డారు. బాధితులు చికిత్స కోసం అర్ధగేరి, ఆలూరు, బళ్లారిలోని ఆస్పత్రులకు పరుగులు తీశారు. గ్రామంలో కుక్కల సంతతి పెరిగిందని, అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

తుగ్గలి: మండల పరిధిలోని నునుసరాల్లకు చెందిన ఐదుగురిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొలం పనులకు పిలిస్తే రావడం లేదనే కారణంతో నునుసరాల్లకు చెందిన హరిజన రంగమ్మ, రంగన్న, కుమారుడు రాకేష్‌పై అదే గ్రామానికి చెందిన దేవదాసు, రామదాసు, మహేష్, పెద్ద ఎల్లగౌడ్, చిన్న ఎల్లగౌడ్ రెండు రోజుల క్రితం కులం పేరుతో దూషించి దాడి చేశారు. బాధితుల పిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు గడ్డివాముల దగ్ధం

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఖాళీ స్థలంలో వేసుకున్న రెండు గడ్డివాములు బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. రూ.50 వేలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన తోట సిద్దప్పకు చెందిన ఐదెకరాల గడ్డి, వందవాగిలి బోయ తాయన్నకు చెందిన రెండెకరాల గడ్డి కాలి బూడిదయ్యింది. స్థానికులు ఆలూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారమివ్వగ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల ప్రమాదం జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మురి'పింఛన్'



మద్దికెరలో తిమ్మక్కకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రీకాంత్



కర్నూలు ఆసుపత్రిలో బజారమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుందరం

తుగ్గలి: ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారకముందే వలంటీరు వచ్చి ఇంటి తలుపు తడితే పింఛన్ కానుక అందినట్టే. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కచ్చితంగా క్రమం తప్పకుండా ప్రతి నెలా జరుగుతున్న ప్రక్రియ ఇది. ఈ క్రమంలో మంగళవారం వలంటీర్లు ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఠంచనుగా పింఛను అందిస్తుండడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన



గాంధీనగర్‌లో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం ఉదయం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డితో కలిసి పట్టణంలోని 22వ వార్డు గాంధీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ పాలనలో అరకొర సంక్షేమ పథ కాలు ఆ పార్టీ వారికే అందేవని దీంతో పేదలు అభ్యున్నతి చెందలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. వార్డులోని ఓ వీధిలో డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు కోరగా వెంటనే పరి ష్కరించాలని కమిషనర్‌కు సూచించారు. మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, యుకె వీరేంద్ర, రాజశేఖర్, ఇషాక్, అమాన్, విశ్వనాథ్‌రమేష్, తదితరులు పాల్గొన్నారు.



విదేశీ విద్యకు ఎంపికైన విక్రమ్‌కు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి జయరాం



రామదుర్గంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి

విదేశీ విద్యకు ఆర్థిక సాయం

ఆలూరు: అట్టడుగు వర్గాల విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఆస్పరికి చెందిన కుంభాల విక్రమ్ నెదర్లాండ్ దేశంలో వెజ్నింజేన్ యూనివర్సిటీ అండ్ రీసెర్చ్ ప్లాంట్‌లో సైన్స్ కోర్సు చదువుకునేందుకు జగనన్న విదేశీ విద్య దీవెన పథకం కింద రూ.56 లక్షల ఆర్థిక సాయం పొందేందుకు ఎంపికయ్యారు. ఇందుకుగాను మొదటి విడత కింద రూ.8,77,547 నగదు విద్యార్థి ఖాతాలో జమ అయ్యింది. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం ఆ విద్యార్థిని అభినందిస్తూ సొంతంగా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఉన్నత చదువులు చదివి మంచి పేరు ప్రతిష్టలను తీసుకురావాలని ఆకాంక్షించారు. పేద కుటుంబానికి చెందిన విక్రమ్ తండ్రి ఆటో డ్రైవర్ కావడంతో వాహన మిత్ర నగదుతో పాటు సోదరుడికి అమ్మ ఒడి, రైతుభరోసా ఇలా ఒకే కుటుంబానికి అనేక రకాలుగా ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని మంత్రి జయరాం వివరించారు. స్థానిక నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, గోవర్ధన్, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతిఇంటికీ లబ్ధి

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం రామదుర్గం గ్రామంలో సర్పంచ్ రోహిణి, నాయకులు విక్రాంత్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే గుర్తించి పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో రామదుర్గం గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.17 కోట్లు లబ్ధి చేకూరిందని వివరించారు. స్థానిక నాయకులు నారాయణ, మల్లికార్జున, రంగస్వామి, తహసీల్దారు లక్ష్మినారాయణ, ఎంపీడీఓ కొండయ్య పాల్గొన్నారు.

జిల్లా అధికారులను కలిసిన ఏపీఆర్‌ఎస్‌ఏ కమిటీలు



కలెక్టర్ సృజనకు పూల బొకే అందజేస్తున్న ఏపీఆర్‌ఎస్‌ఏ పత్తికొండ డివిజన్ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్‌ఎస్‌ఏ)లో పలు విభాగాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కలెక్టరేట్, కర్నూలు, పత్తికొండ డివిజన్లకు నూతన కమిటీలు ఎన్నికయ్యాయి.నీ క్రమంలో మంగళవారం నూతన కమిటీలు జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యలను ఆయా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకేలను అందజేసి తమ సంఘ సభ్యులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు.